సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



.. నిర్వాసితుల ఆందోళన

ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతోంది.

వివరాలు 8లో ▸



.. పోలేపల్లి ఎల్లమ్మ తల్లి

పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర నేటి నుంచి 24వ తేదీ వరకు కొనసాగనుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.1/17.3

మధ్యాహ్నం ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

మారని పోలీసు తీరు..!

అవినీతి, అక్రమాల్లో కొందరు..

- పేకాటరాయుళ్లతో డబ్బులు వసూలు
- క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యం
- ఆరోపణల నేపథ్యంలో పలువురు సిబ్బందిపై వేటు



గద్వాల క్రైం: శాంతిభద్రతలను కాపాడుతూ.. ప్రజలకు మేమున్నామనే భరోసానిచ్చేది పోలీసులు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన పోలీసు శాఖకు కొందరు సిబ్బంది మాయని మచ్చ తెస్తున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారితో చేతులు కలుపుతున్నారు. ఓవైపు ఇసుక, బియ్యం, మట్టి, పేకాట తదితర అసాంఘిక దందాలను కట్టడి చేస్తున్నా.. మరో వైపు అవీనితికి పాల్పడిన వారికి అండగా నిలుస్తూ.. స్థాన చలనం.. అనర్హత వేటుకు గురవుతున్నారు. జిల్లా పోలీసుశాఖలో గత ఎనిమిది నెలలుగా జరుగుతున్న సంఘటనలే ఇందుకు నిదర్శనమయ్యాయి.

జిల్లాలోని కొన్ని సంఘటనలు..

■ 21.08.2024వ తేదీన అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి పోలీసుస్టేషన్ సమీపంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కొంత మంది పేకాట రాయుళ్లు నిత్యం పేకాట దందాను నిర్వహిస్తుండగా పోలీసులు మెరుపు దాడులు చేపట్టి పలువురిని అరెస్టు చేశారు. అయితే పోలీసు సిబ్బందితో పాటు ప్రైవేట్ వ్యక్తులు ఈ దాడుల్లో పాల్గొని పేకాటరాయుళ్ల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి.. పట్టుబడిన నగదును తక్కువగా చూయించారు. ఈ ఘటనపై విచారించి ఆరోపణలు వాస్తవమని పోలీసు పైఅధికారులు నిగ్గు తేల్చారు. దీంతో మల్టీ జోన్ –2 ఐజీ వీవీ.సత్యనారాయణ గద్వాల స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ జములప్ప, ఎస్‌ఐలు విక్రం, శ్రీనివాసులును విధుల నుంచి తొలగించి వీఆర్‌కు అటాచ్ చేశారు.

శాఖాపరమైన చర్యలు తప్పవు



పోలీసుశాఖలో ఏ స్థాయి అధికారి తప్పు చేసిన శాఖ పరమైన చర్యలు ఉంటాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం సమూల మార్పులు తీసుకువస్తున్నాం. పేకాట విషయంలో సిబ్బందిపై వచ్చిన ఆరోపణాలపై ఇప్పటికే అనర్హత వేటు వేశాం. సీఐ స్థాయి అధికారులు మొదలుకుని ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల వరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నాం. అన్ని పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ప్రత్యేక విభాగం నిఘా ఉంచింది. వివిధ స్థాయిలో చేసిన తప్పిదాలపై మెమోలు జారీ చేశాం. నాయకులు, ప్రజలు అనే భేదం లేకుండా పోలీసులు సేవలు అందిస్తారు. దళారీ వ్యవస్థలో ఎవరిని సహించేది లేదు. చట్ట పరిధిలో అందరూ సమానమే.

– శ్రీనివాసరావు, ఎస్పీ

■ 30.08.2024 తేదీన అలంపూర్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజుకు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్లు పలు సామాజిక మాధ్యమాలలో పోస్టులు వైరల్‌గా మారాయి. ఈ సంఘటన పోలీసుశాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజల నుంచి విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు సదరు ఎస్‌ఐను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేస్తూ వీఆర్‌కు అటాచ్ చేశారు.

■ 2.09.2024 తేదీన కేటీదొడ్డి పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఓ వర్గానికి చెందిన నాయకులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే కొందరు అక్రమంగా రేషన్ బియ్యం రాయచూర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో సదరు వాహనాన్ని పట్టుకునే ప్రయత్నంలో పెట్రోలింగ్ వాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదం నుంచి ఎస్‌ఐ, సిబ్బంది బయటపడ్డారు. కానీ, వాహనం దెబ్బతింది. ఈ మొత్తం ఘటనను వెలుగులోకి రాకుండా దెబ్బతిన్న వాహనాన్ని గుట్టుగా వేరే రాష్ట్రానికి తరలించి రిపేర్ చేయించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి రావడంతో గద్వాల డీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ ఉత్తర్వ్యులు జారీ చేశారు.

■ గద్వాల రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పర్వతాలు గద్వాల మండలంలోని ఓ గ్రామంలో నాసిరకం ఇసుకను తరలిస్తున్న క్రమంలో ఓ కూలీ ట్రాక్టర్‌పై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషయంలో సదరు ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. కొన్ని రోజుల తర్వాత స్థాన చలనం కల్పిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లాకు వీఆర్‌కు అటాచ్ చేశారు. ఇటీవల శాంతినగర్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్‌పై పలు ఆరోపణలు రావడంతో స్థానం చలనం కల్పిస్తూ వనపర్తి జిల్లాకు అటాచ్ చేశారు.

■ 25.01.2025న అయిజ ఎస్‌ఐగా విజయభాస్కర్ విధులు నిర్వహిస్తుండగా.. ఓ భూ వివాదం విషయమై తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అయితే తమ ఫిర్యాదును పట్టించుకోకుండా మాకు అన్యాయం చేసిన వ్యక్తితో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు మీడియా ముందుకు వచ్చి ఆరోపించారు. ఈక్రమంలోనే 10 రోజుల పాటు ఎస్‌ఐ శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లగా..ఆ క్రమంలోనే ఎస్‌ఐని మహబూబ్‌నగర్ జిల్లాకు వీఆర్‌కు అటాచ్ చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

■ మల్దకల్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌నాయక్ గద్వాల మండలంలోని ఓ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరం వద్దకు చేరుకుని డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి రావడంతో అతనిపై అనర్హత వేటు పడింది. అయిజ, ధరూర్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల ఫిర్యాదులు అందాయి. వారిపై సైతం విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు తీసుకుని అనర్హత వేటు వేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ కొందరిని కేవలం బదిలీ చేస్తున్నారే తప్పా.. చర్యలకు వెనుకాడుతున్నారని, జిల్లా పోలీసు శాఖలో మార్పు సాధ్యమేనా అన్న విమర్శలు ప్రజల నుంచి వినవస్తున్నాయి.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

- పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలి
- వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు చర్యలు
- కలెక్టర్ బీఎ సంతోష్

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని..గద్వాల పట్టణంలో 'ప్రత్యేక' పాలన మార్కు చూపించి, ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా సమీక్షించి, వారి నుంచి సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలో ప్రగతి పనుల నిమిత్తం ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలన్నారు. పన్ను బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి, రెగ్యులర్ పన్నులను వసూళ్లు చేయాలని ఆదేశించారు. సిబ్బందికి లక్ష్యలను నిర్దేశించి పన్ను, అద్దెలను వసూలు చేయాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్య జఠిలంగా ఉన్న వార్డులలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. తక్షణమే వార్డు అధికారులకు వార్డులను కేటాయించి, వారికి బాధ్యతలను అప్పగించాలన్నారు. ఇక నుంచి వార్డు అధికారులు ఆయా వార్డులలో ప్రజలకు అందుబాటులో ఉండి వారితో మమేకం కావాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఆస్తిపన్ను వసూళ్లు, తాగునీటి సరఫరా, లే అవుట్లు, విద్యుత్తు తదితర విభాగాలను సమర్థవంతంగా పర్యవేక్షించాలన్నారు. ప్రతి వార్డు అధికారికి ఆయా వార్డులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి పట్టు సాధించాలన్నారు. 15 రోజుల తరువాత మరోసారి సమీక్ష నిర్వహించి, పురోగతిపై అంచనా వేస్తామన్నారు. రాబోవు వేసవికాలం తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాంచారు. ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం

మున్సిపాలిటీలో ప్రధానంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలపై ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయని ఆయా విభాగాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తిపన్ను మదింపులో అక్రమాలపై ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. అక్రమ కట్టడాలు, మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా ఉన్నారని, ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషినల్ కలెక్టర్ నర్సింగరావు, కమిషనర్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయెుద్దు

రాజోళి: గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయెుద్దని మండలంలోని పెద్దధన్వాడతోపాటు ఇతర గ్రామాల రైతులు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు విన్నవించారు. మండలంలోని పెద్దధన్వాడలో 20 రోజులుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దీక్షలను మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలుసుకొని వారిని బుధవారం సెక్రటేరియట్‌లోని మంత్రి కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ వారు మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడారు. పచ్చని పొలాలు ఉన్న తమ గ్రామాల నడుమ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిని, క్యాన్సర్లు రావడం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు, తాగునీరు కలుషితం అవుతుందని, పొలాల్లో పంటలు పండవని, దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో 14 గ్రామాలకు పైగా ప్రత్యక్షంగా ఇబ్బందులు ఎదుర్కొగా, తాగునీటి విషయంలో ఏపీలోని గ్రామాలు సైతం ఇబ్బందులు పడతాయని మంత్రికి తెలిపారు. ఎన్నో గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మంత్రికి తెలిపారు. ప్రజలు వ్యతిరేకిస్తున్న ఫ్యాక్టరీని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దధన్వాడతో పాటు ఆయా గ్రామాల ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గద్వాల విద్యార్థికి ప్రధాని ప్రశంస



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆదికేశవ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ అభినందిస్తూ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ప్రేరణ సదస్సుకు విద్యార్థి ఆదికేశవ్ ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా, అందులో గద్వాల విద్యార్థి ఉండటం విశేషం. దేశ చరిత్ర, సాంస్కృక, స్వాభిమాన్, ధైర్య సహసాలు, పరిశ్రములు, కరుణ, సత్యనిష్ట, నాయకత్వం, విశ్వసనీయత, కర్తవ్యం, సత్యం, అహింసా తదితర అంశాలపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ విద్యార్థిని అభినందిస్తూ లేఖ రాశారు. 'జాతీయస్థాయి ప్రేరణ సదస్సుకు ఎంపికై, అక్కడ నిర్వహించిన శిక్షణలో చక్కటి అంశాలను నేర్చుకోవడం శుభపరిణామం. వాటిని జీవితంలో అవలంభిస్తూ ఆదర్శవంతంగా ఎదగాలి' అని లేఖలో ప్రస్తావించారు. హెచ్‌ఎం ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు.. విద్యార్థిని సన్మానించారు.

మిరపకు మద్దతు ధర కల్పించాలి

అలంపూర్: ప్రభుత్వం మిరప రైతులకు మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న డిమాండ్ చేశారు. అలంపూర్ మండలంలోని సింగవరంలో బుధవారం మిరప రైతులను కలిసి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుత.. ఎకర మిరప పంట సాగుకు రూ.లక్షకుపైగా ఖర్చు చేశారని, కానీ మిరపను విక్రయించేందుకు వెళితే సాగు వ్యయం ఖర్చులు రావడం లేదన్నారు. బహిరం మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్తే క్వింటాల్ ధర రూ.10 వేల నుంచి రూ. 12 వేల వరకు మాత్రమే పలుకుతుందన్నారు. పంట మొత్తం విక్రయించిన కనీసం పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిరప బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. క్వింటాల్‌కు రూ. 25 వేల ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నరసింహ్మా, రజాక్, గోపాల్, చిన్న ఈరన్న, బాబుసాబ్, మహమ్మద్, నరసింహులు ఉన్నారు.

నెలాఖరు వరకు ఆర్డీఎస్‌కు నీరు

శాంతినగర్: ఫిబ్రవరి 28 వరకు ఆర్డీఎస్‌కు సాగు నీరు పుష్కలంగా అందుతుందని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వడ్డేపల్లి మండలంలో ప్రవహించే ఆర్డీఎస్ కెనాల్‌లో బుధవారం నీటి ప్రవాహం కొనసాగింది. మరో తొమ్మిది రోజుల పాటు ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టీబీ డ్యాంలో నాల్గో ఇండెంట్‌గా పెట్టిన 1.16 టీఎంసీల నీరు బుధవారం ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ రాజోళిబండకు చేరాయని పేర్కొన్నారు. సాయంత్రం ఆనకట్టపై ఇంచు మేర ఓవర్ ఫ్లో కొనసాగుతోందని, గురువారం ఉదయం వరకు ఓవర్ ఫ్లో మరింత పెరిగే అవకాశం వుందన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ సంప్ వద్ద నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఇండెంట్ నీరు గురువారం సాయంత్రం వరకు తుమ్మిళ్లకు చేరుతుందని, తుమ్మిళ్ల లిఫ్ట్‌కు ఇండెంట్ నీరు నెలాఖరు వరకు అందుతుందని, ఆర్డీఎస్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఐదో చివరి ఇండెంట్ 0.8 టీఎంసీలు మిగిలి వుందని, కేసీ కెనాల్‌కు ఇండెంట్ పెట్టిన సమయంలో పెడతామని ఏఈ పేర్కొన్నారు. అంతేగాక ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ రాజోళి బండ షెట్టర్ల నుంచి ప్రధాన కాల్వ ద్వారా విడుదలైన నీరు బుధవారం అయిజ మండలం చిన్నతాండ్రపాడుకు చేరాయని, గురువారం ఉప్పల వరకు చేరుతాయన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

అయిజ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోదమయానందాజీ మహారాజ్ అన్నారు. బుధవారం మండలంలోని సంకాపురంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రామకృష్ణ ధ్యాన మందిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మనిషి దైనందిన జీవితంలో ఆధ్యాత్మికత చాలా వసరమని అన్నారు. చిన్ననాటినుంచి ఆధ్యాత్మికత కలిగి ఉండాలని, దానివలన సమాజం భక్తి మార్గం వైపు నడుస్తుందని అన్నారు. అహింసా మార్గాన్ని విడనాడాలని, ప్రతి రోజు ప్రతి ఒక్కరు గంటసేపు ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం శర్మ, సూర్య ప్రకాష్, ఉమాదేవి, రాముడు, రాజీవ్, వెకంట్రాములు, కృష్ణ, సత్యనారాయణ, ఈశ్వర్, దామోదర్, ఈశ్వరన్న పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అలంపూర్ చౌరస్తాలో బ్యాంకు సేవలను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం

అలంపూర్: ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఎస్‌బీఐ బ్రాంచీని బుధవారం ఆయనతోపాటు హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ నెట్‌వర్క్–2 ప్రకాష్ చంద్ర బరోర్, రీజినల్ మేనేజర్ సునిత, ఆయా గ్రామాల ప్రజలు డిజిటల్ స్క్రీన్‌పై వర్చువల్ ప్రారంభాన్ని వీక్షించారు. అనంతరం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌నాయక్‌తో మాట్లాడారు. ఇక్కడి భూములు, పంటల వివరాలు, పరిశ్రమలు, మిల్లుల వివరాలు అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. రైతులకు, ప్రజలకు రుణాలు, సేవల గురించి వివరించారు. ఇదిలాఉండగా, ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టిది మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామం. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు అలంపూర్ చౌరస్తాలో ఎస్‌బీఐ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఎస్‌బీఐ సేవలు తీసుకొచ్చిన చైర్మన్‌కు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



జై భవానీ.. వీర శివాజీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు.. కాశాయ జెండాలు.. హిందూ ధార్మిక పాటల నడుమ జిల్లా కేంద్రమైన గద్వాలలో వైభవంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్ర సాగింది. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, శంభూనాథ్‌మఠం యూత్, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

– గద్వాల టౌన్

పునరావాసానికి సన్నద్ధం

- నల్లమల అడవి నుంచి చెంచుపెంటల తరలింపునకు కొనసాగుతున్న కసరత్తు
- మొదటి విడతలో కుడిచింతలబైల్, సార్లపల్లి, వటవర్లపల్లి గ్రామాలు
- ఎన్టీసీఏ ద్వారా ప్రత్యేక పునరావాస ప్యాకేజీ
- పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద ఏర్పాట్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్న చెంచుపెంటల తరలింపునకు అవసరమైన చర్యలను అటవీశాఖ వేగవంతం చేసింది. ఇప్పటికే కోర్ ఏరియాలో ఉన్న సార్లపల్లి, కుడిచింతల్‌బైల్, వటవర్లపల్లి గ్రామాలను ఖాళీ చేయించేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ(ఎన్టీసీఏ) ద్వారా బాధితులకు పునరావాస ప్రత్యేక ప్యాకేజీని అందజేయనున్నారు. కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే అధికారులు పునరావాస ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. మరో రెండు నెలల్లోనే పునరావాసానికి పూర్తిస్థాయి అనుమతులు లభిస్తాయని భావిస్తున్నారు.

విడతల వారీగా చెంచుపెంటల తరలింపు..

నల్లమల అటవీప్రాంతంలో ఉన్న పులులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా పరిధిలో ఉన్న చెంచు పెంటలను ఖాళీ చేయించి, అడవి బయట వారికి పునరావాసం కల్పించేందుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. ప్రధానంగా పెద్దపులుల సంరక్షణ, వాటికి స్వేచ్ఛగా సంచరించేందుకు వీలు కల్పించడం, వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ వాతావరణాన్ని నిరోధించడంలో భాగంగా పునరావాస ప్రక్రియను చేపడుతున్నట్టు అటవీశాఖ చెబుతోంది.



కుడిచింతల్‌బైల్‌లో ఆర్టీటీ కట్టించిన చెంచుల ఆవాసాలు

ఇప్పటికే ఇందుకోసం ప్రక్రియను ప్రారంభించగా, తొలి విడతగా తరలించనున్న సార్లపల్లి, కుడిచింతల్ బైల్, వటవర్లపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించి, స్థానికుల నుంచి అంగీకార పత్రాలను తీసుకుంటున్నారు. స్వచ్ఛందంగా తరలింపునకు ఒప్పుకున్న వారికే పునరావాస ప్యాకేజీని అమలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని బలవంతం చేయబోమని అటవీ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక చెంచుల్లో మాత్రం భయాందోళనలు నెలకొన్నాయి.

తొలి విడతలో మూడు గ్రామాలు..

నల్లమల అటవీ ప్రాంతంలోని కోర్ ఏరియాలో ఉన్న సుమారు 20 వరకు చెంచుపెంటలను విడతల వారీగా ఖాళీ చేయించి మరో చోట పునరావాసం కల్పించాలని అటవీశాఖ భావిస్తోంది. వీటిలో మొదటి విడతగా సార్లపల్లి, కుడిచింతల్ బైల్, వటవర్లపల్లి గ్రామాలను ఖాళీ చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం క్షేత్రస్థాయి సర్వేతో పాటు కుటుంబాల నుంచి అంగీకార పత్రాలను సేకరిస్తోంది. సార్లపల్లిలో మొత్తం 269 కుటుంబాలు ఉండగా, వీరిలో 83 కుటుంబాలు మాత్రమే చెంచులు కాగా, మిగతా ఇతర వర్గాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో ఇతర వర్గాలు మాత్రమే తరలింపునకు అంగీకారం చెబుతుండగా, మెజార్టీ చెంచులు ఒప్పుకోవడం లేదు.

ప్యాకేజీ కింద 5 ఎకరాలు, లేదంటే రూ.15 లక్షలు

అడవిని ఖాళీ చేసి మరో చోటుకు తరలుతున్న స్థానికులకు పునరావాసం కింద ఎన్టీసీఏ ప్రత్యేక ప్యాకేజీని అందిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పునరావాస ప్యాకేజీ, లేదా 5 ఎకరాల భూమి కేటాయిస్తుంది. ఈ రెండింటిలో ఏదైనా ప్యాకేజీని బాధితులు ఎంచుకోవచ్చు. ఖాళీ చేయనున్న గ్రామస్తులకు పునరావాసం కల్పించేందుకు పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద ఇప్పటికే భూమిని గుర్తించారు. అక్కడే పునరావాస కాలనీలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు ఇళ్లు, పాఠశాల, రోడ్లు, ఇతర మౌలిక వసతులను కల్పించనున్నారు.



సార్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సక్రమంగా ఇస్తేనే వెళతాం..



ఎన్నాళ్ల నుంచో అడవినే నమ్ముకుని ఉంటున్నాం. పులులు, వన్యప్రాణుల సంరక్షణకు మా ఊరిని ఖాళీ చేసి మరో చోటికి పంపిస్తాం అంటున్నారు. పునరావాసం కింద నష్టపరిహారాన్ని అందించి, అక్కడ సౌకర్యాలు కల్పించిన తర్వాతే వెళతాం. అందరికీ న్యాయమైన పరిహారాన్ని అందించి పునరావాస ప్రక్రియ చేపట్టాలి.

– మండ్లి భౌరమ్మ, కుడిచింతల్‌బైల్, అమ్రాబాద్ మండలం

మాకు జీవనోపాధి కల్పించాలి..



ఏళ్లుగా ఉన్న మా ఊరిని ఖాళీ చేయించి, మమ్మల్ని మరో చోటుకి తరలిస్తామని చెబుతున్నారు. ఈ ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుంది, పరిహారం ఎప్పుడు అందుతుందన్న దానిపై ఎవరికీ స్పష్టత లేదు. పునరావాసం కల్పిస్తే అక్కడ జీవనోపాధి కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

– పోషప్ప, కుడిచింతల్‌బైల్, అమ్రాబాద్ మండలం

స్వచ్ఛందంగా తరలింపు..



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్న ఆవాసాల్లో ఉంటున్న వారిని అడవి బయట పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తరలింపు ప్రక్రియ స్వచ్ఛందంగా అంగీకారం తెలిపిన వారికే చేపడతాం. పునరావాసం కింద రూ.15 లక్షల ఆర్థిక సహాయం, లేదా 2 హెక్టార్ల భూమి కేటాయింపు ఉంటుంది.

– రోహిత్ గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



జిల్లాకేంద్రంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజు

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాల వల్ల మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన రాజుకు భార్యతో కుటుంబకలహాలు చోటుచేసుకున్నాయి. మనస్థాపానికి గురై జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరకొని రాజును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నాకి పాల్పడిన రాజు జేబులో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కుటుంబకలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

బస్టాండులో అనాథ వృద్ధుడు మృతి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వట్టెం గ్రామానికి చెందిన అనాథ వృద్ధుడు గోవింద్ (65) మృతి చెందిన సంఘటన బుధవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. బిజినేపల్లి రెండో ఎస్‌ఐ రాజశేఖర్ మృతదేహాన్ని గుర్తించి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడికి కుటుంబ సభ్యులు లేకపోవడంతో భోజనం లేక అనారోగ్యంతో చనిపోయినట్లు పలువురు అనుమానిస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వీపనగండ్ల: కుటుంబ కలహాల వల్ల ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాణి వివరాల ప్రకారం.. మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన రాచాల శ్రీనివాస్‌గౌడ్ (50) కొన్ని నెలలుగా భార్య, పిల్లలతో మహబూబ్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. తమ సమీప బంధువు చనిపోవడంతో వారు ఇటీవల బొల్లారం గ్రామానికి వచ్చారు. బుధవారం ఉదయం కుటుంబంలో నెలకొన్న ఆస్తి పంపకాల విషయంలో ఆవేశానికి గురైన శ్రీనివాస్‌గౌడ్ తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడు..

అడ్డాకుల: మండల కేంద్రం శివారులో ఎస్‌ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌కు చెందిన వినిత్ అడ్డాకుల సమీపంలోని ఎస్‌ఎస్‌వీ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతని మేనమామ లఖాన్(51) ఇక్కడే పని చేసేందుకు కొన్నాళ్ల క్రితం వచ్చాడు. అతనిని పనికి పెట్టుకోకపోవడంతో మేనల్లుడి వద్దే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన లఖాన్ బుధవారం కార్మికులందరు పనిలోకి వెళ్లిన తర్వాత క్వార్టర్స్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా గమనించిన కార్మికులు మృతదేహాన్ని బయటకు తీశారు. మేనల్లుడు వినిత్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిమ్మాజిపేట: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, బాధితుల వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం భట్టుపల్లి తండాకు చెందిన సంధ్య(22)ను, తిమ్మాజిపేట మండలం గొరిట తండాకు చెందిన పాత్లావత్ జగన్‌కు ఇచ్చి 2023 మేలో వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అదనపు కట్నం కోసం భర్త వేధించేవాడు. మంగళవారం రాత్రి కూతురు చనిపోయిందని, జడ్చర్ల ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు తల్లికి సమాచారం అందించారు. సంధ్యకు భర్త, 11నెలల కూతురు ఉంది. అదనపు కట్నం కోసమే తమ కూతుర్ని హత్య చేశారని తల్లి అంజమ్మ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉదండాపూర్ నిర్వాసితుల ఆందోళన



ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు



ఒంటిపై పెట్రోలు పోసుకుంటున్న రైతు మల్లయ్య

భిక్షాటనకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు

జడ్చర్ల టౌన్: పాలమూరు ప్రాజెక్టులోని ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులు, రైతుల పోరాటం రోజురోజుకు ఉధృతంగా మారుతోంది. పది రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్న వారు బుధవారం పదుల సంఖ్యలో కావేరమ్మపేట వద్ద ఉన్న ప్రభుత్వ అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. వినూత్నంగా నిరసన చేపట్టాలని నిర్ణయించి భిక్షాటన చేయాలని భావించారు. విషయం తెలుసుకున్న సీఐ కమలాకర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. అనుమతి లేదని.. గురువారం ఆర్డీఓ ఉదండాపూర్ గ్రామానికి వచ్చి మాట్లాడతారని చెప్పారు. అప్పటికీ అంగీకారం కుదరకుంటే అప్పుడు అనుమతిస్తామని నచ్చజెప్పారు. ఈ సమయంలో కాసేపు సీఐ, నిర్వాసితుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది.

రైతు ఆత్మహత్యాయత్నం..

భిక్షాటనకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని పోలీసులు తేల్చిచెప్పడంతో మల్లయ్య అనే రైతు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకోగా గుర్తించిన పోలీసులు వెంటనే అతడిని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శాంతియుతంగా భిక్షాటన చేస్తామని నిర్వాసితులు పోలీసులతో వాదనకు దిగారు. తప్పనిసరి పరిస్థితుల్లో జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీకి అనుమతించారు. నిర్వాసితులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అతిథి గృహం నుంచి స్టేషన్ వరకు ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో భిక్షాటన చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండా ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని డీఎస్పీ హెచ్చరించినా వారు వినలేదు. గురువారం భిక్షాటన చేసి తీరుతామంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సర్వే చేసి అనర్హులను ఏరేస్తాం : ఎమ్మెల్యే

ఉదండాపూర్ గ్రామంలో తప్పనిసరిగా సర్వే చేసి అందులో అనర్హులుంటే ఏరి వేసి నిజమైన నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పుర పరిధిలోని పాతబజార్‌లో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉదండాపూర్‌లో సర్వే జరిగితే తమ దొంగతనం బయటపడుతుందని బీఆర్‌ఎస్ నాయకులే అడ్డుకుంటున్నారని విమర్శించారు. వల్లూరులో 1,005 మంది రైతులు ఉన్నట్లుగా రికార్డు ఉందని.. సర్వే చేపట్టగా అర్హులు కేవలం 574 మంది మాత్రమే ఉన్నట్లు తేలిందని వివరించారు. మిగిలిన వారంతా బీఆర్‌ఎస్ నాయకులు చేర్చిన బోగస్ లబ్ధిదారులన్నారు. అదేవిధంగా ఉదండాపూర్‌లోనూ సర్వే చేపడితే వారి బాగోతాలు బయటపడతాయనే భయంతో అడ్డుకుంటున్నారని.. ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే చేపడతామని తెలిపారు. సర్వే జరిగితే అవార్డు పాసవుతుందని.. ఆరునెలల్లోగా పరిహారం చేతికందుతుందని వివరించారు. తను ఎమ్మెల్యే అయ్యాక తండావాసులకు రూ.41 కోట్లు విడుదల చేయించానని.. మరో రూ.71 కోట్లు కలెక్టర్ ఖాతాలో చేసినట్లు చెప్పారు. తనది రైతు పక్షపాతమని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లిందని, త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు.

భక్తుల పాలిట కల్పవల్లి.. పోలేపల్లి ఎల్లమ్మ తల్లి



ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం

- మినీ మేడారంగా పోలేపల్లి జాతర
- స్వయంభూగా ఎల్లమ్మ అమ్మవారు
- నేటి నుంచి 24 వరకు బ్రహ్మోత్సవాలు
- 21న పిడేకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్, ఎస్పీ

కోస్గి: భక్తుల పాలిట కల్పవల్లిగా పోలేపల్లి ఎల్లమ్మ తల్లి బాసిల్లుతోంది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి స్వయంభూగా వెలిశారు. రాష్ట్రంలో మేడారం తర్వాత అంతటి ఆదరణ ఉన్నది పోలెపల్లి జాతర మాత్రమే. మినీ మేడారంగా ఈ జాతర ప్రసిద్ధికెక్కింది. గురువారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటుగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు సూరత్, అహ్మదాబాద్ నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఇప్పటికే వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అన్ని శాఖలతో అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి దిశానిర్దేశం చేశారు.



అమ్మవారి విగ్రహం

హెలీప్యాడ్ సిద్ధం

మిని మేడారంగా పేరొందిన పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు 21వ తేదీన జరిగే షిడే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై అమ్మవారి దర్శింకుంటున్నారు. ఇప్పటికే రెండు వరుసల రోడ్లు పూర్తిచేశారు. సీఎం రాక కోసం హెలీప్యాడ్ సిద్ధం చేశారు.

ప్రత్యేక బస్సులు..

పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేకంగా నారాయణపేట, కోస్గి, తాండూర్, పరిగి డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేయనుంది. ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులకు దేవస్థాన కమిటీ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయిస్తుంది.

అమ్మవారి షిడే ప్రత్యేకం

పోలేపల్లి ఎల్లమ్మ అంటే దశాబ్దాల నుంచి ప్రత్యేకత సంతరించుకుంది. జాతరలో ఇక్కడ అమ్మవారి షిడే ప్రత్యేకం. గతంలో జాతరలో సిడేకు ఒక జోగు మహిళను కట్టి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించేవారు. పదేళ్లుగా తోట్టెనె కట్టి అందులో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ప్రదక్షిణ చేయిస్తున్నారు. షిడే, రథం ఏళ్ల కిందటి కావటంతో శిథిలావస్థకు చేరాయని భావించిన దాతలు రూ.10లక్షలతో అమ్మవారి సిడే , రూ.14 లక్షలతో రథాన్ని ఆలయానికి అందజేశారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వీటిని వినియోగిస్తున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. 22వ తేదీన తేరు, 23న రథోత్సవం, 23న ప్రత్యేక పూజలు, 24న గ్రామంలో పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి.

అభివృద్ధే చరిత్రలో నిలిచిపోతుంది



పెద్దరేవల్లిలో చత్రపతి శివాజి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అరుణ ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి తదితరులు.

- ఎంపీ డీకే అరుణ
- సమష్టి కృషితోనే అభివృద్ధి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- పెద్దరేవల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ

రాజాపూర్(బాలానగర్): ప్రభుత్వాలు మారుతుంటాయి కానీ చేసిన అభివృద్ధే చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లిలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చత్రపతి శివాజీకి ఆయన తల్లి ధైర్యాన్ని నూరిపోసిందన్నారు. యువతకు ఆయన పెద్దస్ఫూర్తి అన్నారు. పాలమూరు జిల్లా కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు సీఎం వెనుకబడ్డ జిల్లాపై దృష్టి సారించాలన్నారు. ఉదండపూర్ రైతులు భూములు, ఇళ్లు కోల్పోయారని వారికి పరిహారం అందించాలని కోరారు. పార్టీలు పక్కనపెట్టి సమష్టి కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శివాజీ విగ్రహాన్ని చూస్తే యువతలో స్ఫూర్తి రావాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు నష్టపోయిన ఉదండపూర్ వాసులకు అండగా ఉంటాన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరమణారెడ్డి, సాధువెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, తిరుపతి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సాహితీరెడ్డి, లింగారెడ్డి, నందీశ్వర్, శ్రీనివాస్ నాయక్, కోటజనార్ధన్, మహేందర్‌రెడ్డి, వెంకట్ బాలవర్ధన్‌గౌడ్, లక్ష్మీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల ప్రకాశ్ మృతి



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్ (77) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన పలు పదవులను అధిరోహించారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో ప్రకాశ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేశారు. 1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలుపొందారు. మహబూబ్‌నగర్ సూపర్‌బజార్ చైర్మన్, రీజినల్ ఫిలిం సెన్సార్ బోర్డుమెంబర్‌గా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా పనిచేశారు. 1999–2004 వరకు మున్సిపల్ చైర్మన్‌గా, 2005–2012 వరకు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2012లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన ప్రకాశ్ మృతిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 24 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎమడ కాల్వల ద్వారా 130 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

నమ్మించి.. మోసం చేశారు

- సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుకున్న బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు

మిడ్జిల్: ఎలాంటి ఆర్థిక సాయం కావాలన్న తమను సంప్రదించండి అంటూ సోషల్ మీడియా ప్రకటనలు వెల్లువలా కనిపిస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో కొందరు వీరిని నమ్మి మోసపోతుంటారు. ఇలాంటే సైబర్ మోసానికి గురైన ఘటన బుధవారం మిడ్జిల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు తండ్రి జంగయ్య గతేడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రుల్లో చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఇన్‌స్టాలో హర్షసాయి ఐడీతో ఉన్న గ్రూప్‌లో సహాయం కావాలని ఆంజనేయులు కోరాడు. ఇది గమనించిన కేటుగాళ్లు హర్షసాయి ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని, రూ.4లక్షలు సహాయం చేస్తామని ఆంజనేయులును నమ్మించారు. డాక్యుమెంట్ చార్జి, ఆఫీస్ బ్యాక్ ఎండ్ చార్జి ఉంటాయని మీరు డబ్బులు పంపితే వెంటనే సహాయం అందుతుందని తెలిపారు. నిజమేనని నమ్మిన బాధితుడు ఆంజనేయులు వారిచ్చిన నంబర్లకు మంగళవారం సాయంత్రం ఫోన్‌పే ద్వారా ఐదు విడుతల్లో రూ.22,500 పంపించాడు. సహాయం కావాలని బాధితుడు పదేపదే ఫోన్ చేయగా బుధవారం ఉదయం కేటుగాళ్లు రూ.5,500 తిరిగి పంపించారు. తర్వాత వారు ఇచ్చిన ఫోన్ నంబర్లు స్విచాఫ్ అయ్యాయి. మోసపోయానని భావించిన బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీ : వ్యక్తి మృతి

శాంతినగర్: ట్రాక్టర్‌ను మోటార్ సైకిల్ ఢీ కొట్టిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డేపల్లి మండలం జూలెకల్ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జూలెకల్ శివారులో ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవడంతో రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్ వెళ్లాడు. ఈ క్రమంలో శాంతినగర్ నుంచి అయిజ వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి(50) ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి యాత్ర

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మారేపల్లికి చెందిన శివమాలధారుడు 63 ఏళ్ల బాలనాగయ్య మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి బయలుదేరారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక అయ్యప్ప ఆలయంలో సేద తీరుతుండగా గ్రామస్తులు పలువురు ఆయనతో మాట్లాడగా వివరాలు వెల్లడించారు. నాలుగేళ్ల కిందట శివమాల ధరించి మోకాళ్లపై నడుస్తూ శ్రీశైలానికి బయలుదేరానని.. ఉమామహేశ్వరం కమాన్ వద్దకు చేరుకోగానే అస్వస్థతకు గురికావడంతో యాత్ర ముగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడటంలో ఈ నెల 10న తిరిగి ఉమామహేశ్వరం కమాన్ నుంచి యాత్ర ప్రారంభించినట్లు వివరించారు. ఆయన వెంట ఇద్దరు కుమారులు, శివదీక్షలో ఉన్న మరో నలుగురు ఉన్నట్లు చెప్పారు.



అతివేగానికి రెండు నిండు ప్రాణాలు బలి



ప్రమాదానికి కారణమైన కారు

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు యువకుల దుర్మరణం
- తాడూరు మండలం గుంతకోడూరు గేట్ సమీపంలో ఘటన



శేఖర్ (ఫైల్)



శ్రీనివాసులు (ఫైల్)

తాడూరు: అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన తాడూరు మండలం గుంతకోడూరు గేట్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి వివరాల మేరకు.. తెలకపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన అతినారపు శేఖర్ (31), శ్రీనివాసులు (42) బంధువులు. వీరిద్దరు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఓ శుభకార్యంలో వారు పాల్గొని తిరిగి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. గుంతకోడూరు గేట్ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి వీరి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కనున్న మొక్కజొన్న పంటలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా.. శేఖర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇల్లు మా పేరిట రిజిస్ట్రేషన్ చేయించండి

- మమ్మల్ని కుమారులు, కూతుళ్లు పట్టించుకోవడం లేదు
- వయోవృద్ధుల సంక్షేమ కమిటీకి తల్లిదండ్రుల వేడుకోలు



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆ వృద్ధ తల్లిదండ్రులకు తొమ్మిది మంది సంతానం.. వీరిలో ఐదుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. అందరి పెళ్లిళ్లు చేసిన వారు చివరికి తమకున్న స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు గతంలో బ్యాంకు రుణం వస్తుందని భావించి మూడో కొడుకుకు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే కొన్నాళ్లకు అతను తన అక్కకు బదిలీ చేయగా.. ఆ వృద్ధులను ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడంతో లబోదిబోమంటున్నారు. తమ గోడును బుధవారం నగర వయోవృద్ధుల సంక్షేమ కమిటీ ఎదుట వెళ్లబోసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన లక్ష్మమ్మ (65), సామర్ల రంగయ్య (70) దంపతులకు స్థానికంగా 133 గజాల స్థలం ఉంది. ఎనిమిదేళ్ల క్రితం తమకున్న అందులో మూడో కుమారుడు దత్తు బ్యాంకు ఉద్యోగి కావడంతో రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకునేందుకు అతని పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే ఇటీవల కుటుంబ సభ్యుల సమ్మతి లేకుండానే తన అక్క వితంతువు తిరుపతమ్మ (స్టాఫ్‌నర్స్)కు మార్పిడి చేయించాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ వృద్ధ తల్లిదండ్రుల ఆలనా పాలనను మాత్రం ఎవరూ సరిగ్గా చూడటం లేదు. చివరకు ఇంటి మేడపైన ఉన్న సింగిల్ బెడ్‌రూంలో దివ్యాంగుడైన చివరి కుమారుడు రాజు వద్ద ఉంటున్నారు. ఈయనతో పాటు భార్యాపిల్లలు, వృద్ధ దంపతులకు ఏమాత్రం గదులు సరిపోక అవస్థలు పడుతున్నారు. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే వరండాలో చుట్టూ దేరాలు వేసుకుని నివసిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ఇంటిని తమ పేరిట మార్పిడి చేయించాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని అధికారులకు విన్నవించారు. స్పందించిన నగర వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్మన్ డి.మహేశ్వర్‌రెడ్డి, కమిటీ కన్వీనర్ సీడీపీఓ రాధిక, వన్‌టౌన్ సీఐ ఎం.అప్పయ్య, డా.మహమ్మద్ అస్గర్ అలీ, జి.నాగభూషణం, కె.జయప్రద సమావేశమయ్యారు. ఈకేసుకు సంబంధించిన కుటుంబసభ్యులందరినీ పిలిపించి పూర్వాపరాలను క్షుణ్ణంగా తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈనెల 23వ తేదీ వరకు తమకు గడువు ఇవ్వాలని, తమ తల్లిదండ్రుల సంరక్షణ కోసం ఒక అంగీకారానికి వస్తామని అధికారులకు కుటుంబసభ్యులు తెలిపారు.